Volume: 3 Issue: 12 Pages: 59-61




# పాట - తెలంగాణ పోరాట చిత్రణ

*[1] Guthikonda Chandrakala

*[1] Assistant Professor, Department of Telugu, Government Degree College Bhupalpally, Jayashankar Bhupalpally, Telangana, India.

**Article Info.**
**E-ISSN: 2583-6528**
**Impact Factor (SJIF): 6.876**
**Peer Reviewed Journal**
**Available online:**
**www.alladvancejournal.com**

**Received:** 16/Nov/2024
**Accepted:** 20/Dec/2024

***Corresponding Author**
**Guthikonda Chandrakala**
Assistant Professor, Department of Telugu, Government Degree College Bhupalpally, Jayashankar Bhupalpally, Telangana, India.

**Abstract**
పాట చైతన్యవంతమైన కళారూపం. పాటకు పోరాటానికి విడదీయరాని సంబంధం ఉంది. శాంతియుతంగానైనా, ఉద్యమం రూపమైనా పాట లేని పోరాటం కనిపించదు. పాట పోరాటానికి మూల కారణమైన సమస్య తీవ్రతను విశ్లేషించడంలో, పరిష్కారం కోసం ఆలోచించేలా చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాటంలో పాట ప్రముఖ పాత్ర వహించింది. వంటావార్పు, రాస్తా రోకో, జైల్ భరో, ధూం ధాం వంటి కార్యక్రమాలలో ప్రతి చోటా ప్రజల నోట పాట ప్రవాహమై, పోరాట స్ఫూర్తిని నింపింది. ఆత్మ గౌరవం, అస్తిత్వ చైతన్యం పెంపొందించి ప్రత్యేక రాష్ట్ర కాంక్షను రగిలించింది. పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం ఏర్పాటైన సమైక్యాంధ్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా అవతరించడం మొదలు యాభై ఏళ్లుగా ముల్కీ నిబంధనల ఉల్లంఘన, నీళ్ళు, నిధులు, నియామకాల్లో జరిగిన అన్యాయం, అభివృద్ధి పేరుతో జరిగిన దోపిడీ, ఇలా ఒక్కొక్క అంశాన్ని ఒక్కొక్క పాటలో వివరిస్తూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత గురించి చాటి చెప్పింది. ఈ ఉద్యమ నేపథ్యంలో వెలువడిన అనేక పాటలు పుస్తకాలుగా, సి.డి లో రూపంలో నేటికీ లభిస్తున్నాయి. ఈ పాటలలో వ్యక్తమైన తెలంగాణ పరిస్థితిని, పోరాట కారణాలను పరిశీలించడం ఈ పత్రం ప్రధాన ఉద్దేశం.

**Keywords:** ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, వరంగల్ రచయితల సంఘం, పాట, తెలంగాణ ఉద్యమం- పాట ప్రభావం.

## ಪರಿಚಯ

పాట అతి ప్రాచీనమైన ప్రక్రియ. మాటకి కొనసాగింపే పాట. మనిషి జీవితంలో ఎంతో ప్రాముఖ్యతను పొందింది పాట. మానవ సంబంధాలు, సంఘర్షణలు, సంతోషాలు అన్నింటితో ముడిపడ్డ ప్రక్రియ పాట. మనుషుల అనుభవాలు, అనుభూతులు, ఆరాటాలు, ఆశలు, ఆవేదనలు, ఆనందాలు పాటలై ప్రజల నోళ్ళలోనే ప్రవహిస్తూ ఉంటాయి. బహుశా మనిషి జీవితంలో పుట్టుక నుండి చావు వరకు పాట కాని, పాట లేని సందర్భం లేదు. అందుకే పాటలో ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. పాట పనిలోని అలసటను పోగొట్టి ఆహ్లాదాన్ని పంచడమే కాక ఆలోచనలు రగిలిస్తుంది. దోపిడీదారుల గుండెల్లో చురకత్తి అవుతుంది. సమకాలీన సామాజిక రుగ్మతలను ఎండగడుతూ చైతన్యం నింపుతుంది, పోరుబాటలో ఉద్యమాలకు ఊపిరై నిలుస్తుంది. ప్రగతి పథం వైపు పయనం సాగిస్తుంది. అటువంటి పాట తెలంగాణ అస్తిత్వ పోరాటంలో ప్రముఖ పాత్ర వహించింది. ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో ముందువరుసలో నిలిచింది. తెలంగాణ ఉద్యమ సమయంలో వెలువడిన పోరాట పాటలను పరిశీలించటం ఈ వ్యాసం ఉద్దేశం. ఉద్యమ అవసరంలో ఎన్నో పాటలు వెలువడినా పత్ర పరిమితి దృష్ట్యా కేవలం వరంగల్లు రచయితల సంఘం ముద్రించిన ‘ఆనుగర్రలు - తెలంగాణ ఉద్యమ గేయాలు’ అనే పాటల సంకలనం పరిశీలనకు ఎంచుకున్నాను.

## విశ్లేషణ

దోపిడి, పీడన, అసమానతలు పెరిగినప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు ప్రజా పోరాటం ముందుకు వస్తుంది. అది తీవ్ర స్థాయికి చేరినపుడు ఉద్యమ రూపం దాలుస్తుంది. సమైక్యాంధ్ర పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయాలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు పరిష్కారంగా భావించి పోరాటం ప్రారంభమైంది. తొలిదశలో 369 మంది విద్యార్థుల మరణంతో అణిచివేతకి గురైనా మరలా తీవ్ర స్థాయిలో ఉద్యమ రూపం దాల్చింది. తెలంగాణ ప్రజలు సాగించిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో సాంస్కృతిక రంగానికి చెందిన కళాకారులు ఎందరో తమవంతు కృషి

చేశారు. అందులో ప్రధానంగా గూడ అంజయ్య, గోరేటి వెంకన్న, అందెశ్రీ, జయరాజు, వరవరరావు, బి.నర్సింగరావు, రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్, భూపాల్, అంతడుపుల నాగరాజు, దరువుఎల్లన్న, విమలక్క, స్వర్ణ, తేలు విజయ, మధుప్రియ మొదలగు వారెందరో వాగ్గేయకారులు, గాయకులు ఉన్నారు. వీరంతా పాటల ద్వారా అన్యాయాలను ప్రశ్నించారు, అసమానతలు వివరించారు, వివక్షపై ఆక్రోశం వెలిబుచ్చారు, త్యాగాలను కీర్తించారు. బలిదానాలను వద్దన్నారు. స్వరాష్ట్రకాంక్షను ప్రజలలో అణువణువునా రగిలించారు. ఊరూరా తిరుగుతూ ప్రతి సభలో, సమావేశంలో గొంతెత్తి గళాలను వినిపించడమేకాక, గజ్జె కట్టి ఆడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై ప్రజలను ఉద్యమోన్ముఖులను చేసారు. పోరాట స్ఫూర్తిని నింపారు.

"అనుగ్రలు" గేయ సంకలనం వరంగల్ రచయితల సంఘం ఆధ్వర్యంలో నల్లెల్ల రాజయ్య ప్రచురించిన పాటల సంకలనం. తెలంగాణ యువకులు ఆత్మబలిదానాలను చేసుకుని నిండు జీవితాలు బుగ్గిపాలు చేసుకుంటున్న సందర్భంలో ఆ దుష్పరిణామాన్ని నివారించుటకు కొన ఊపిరి ఉన్నంతవరకు సంకల్ప ప్రేరితులై ఉద్యమాలు చేసి తెలంగాణ సాధించాలనే సందేశాన్ని తమ పాటల ద్వారా అందించుటకు రచయితలు, కవులు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా 2010 మార్చి 23న తెలంగాణ ఉద్యమ గేయ గాన సమ్మేళనం నిర్వహించారు. ఆ సమ్మేళనంలో పాల్గొని ఆలాపించిన రచయితల గేయాలతో పాటు, ప్రముఖ తెలంగాణ ప్రజా గాయకుల గేయాల్ని సమ్మిళితం చేసి ముప్పై పాటలతో ఈ సంకలనం ప్రచురించబడింది. ఈ పాటల వరుసలో

"తల్లీ తెలంగాణమా….. నా మల్లెల మా గానమా…." అనే పాటలో

నీ నీళ్లు తరలిపోయెనా- నీ వనరులు వట్టిపోయెనా
నీ పల్లెలు చిద్రమాయె - నీ బిడ్డల వలస లాయె
నీ యవుసం ఎడారాయే- తెలంగాణమా
………..
………..
చదువులు కొలువు ల్లేక – ఉపాధులు పనులు ల్లేక
మన హక్కును మన సొత్తును - అన్ని దోసుకున్నారాయే
కలిసి ఉంటే సుఖమన్న - కపట నీతి తెలిసిపాయె
దోపిడీ పాలకుల - దొంగతనం ఎరుకాయెను
వాళ్లు అన్నదమ్ములనుకుంటనే తెలంగాణమా
వెనక దెబ్బతీసిరమ్మ - ఇగ పోరాటమే చేద్దామమ్మా
ఈ బానిసత్వమిక వద్దని తెలంగాణమా
ఆత్మగౌరవ పతాకమైన తల్లి తెలంగాణమా –

అంటూ అనిశెట్టి రజిత నీళ్ళు, నిధులు, నియామకాల విషయంలో జరిగిన అన్యాయాలపై ఆక్రోశం వెలిబుచ్చడమేగాక, పోరాటమే మార్గం అన్నారు. "అరిగోస" అనే ఏడు చరణాల పాటలో –

నిజాం రాజు ఫర్మానేది - ముల్కీ రూలు మూసిల గలిసే
పటేల్ సూత్ర పథకం తోటి - చెత్తబుట్టలో చేరిపోయే
ఫజలాలి సిఫారసులు - పక్కదారి పట్టిపోయే
విశాలాంధ్ర ద్రోహంతోటి- విషాదమే మిగిలిపోయే –

అంటూ పిట్ట సాంబయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ సమయంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను పెద్ద మనుషుల ఒప్పందం అమలు బుట్టదాఖలైందని గుర్తు చేశారు. 610 జీవో ఆగమయిందని నిధులన్నీ ఎత్తుకుపోయి, నీళ్లన్నీ గుంజుకుపోయి కరువు పరిస్థితి తెచ్చారన్నారు. విద్యార్థులు, యువకులు నేడు ప్రత్యేక ప్రాంతం కోసం తృణప్రాయంగా ప్రాణాలు తీసుకుంటున్నారని అయినా గిర్ గ్లాని కమిటీ, శ్రీకృష్ణ కమిటీ అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. విద్యార్థులెవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని ప్రత్యేక రాష్ట్ర ప్రతిఫలాలు పొందుటకు ప్రాణాలతో ఉండాలన్నారు. తల్లడిల్లే తనువుల కోస, అరిగోస బందిఖానా నా తెలంగాణ అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.

పరుగు పరుగున వచ్చినారు పట్నంలో వాలినారు
వలసొచ్చినదే మరిచి వతందారులయ్యినారు
బర్రె జనిగెలోలె పట్టి జిల్లెడమ్మ జిట్టా
మన బతుకాగం చేయబట్టే జిల్లేడమ్మా జట్టా –

అనే పాటలో గోరేటి వెంకన్న వలసవచ్చిన సీమాంధ్రులు రాజధానిగా తామే హైదరాబాద్ ను అభివృద్ధిని చేసామని ప్రగల్భాలు పలకడం, కంపెనీలు, షాపింగ్ మాల్స్, కోచింగ్ సెంటర్లు పెట్టి కార్పొరేటు వ్యాపారాలు చేసి లాభపడింది గాక హైదరాబాద్ ను కేంద్రపాలిత ప్రాంతం చేయాలని అనడం సీమాంధ్రులు జలగల మాదిరిగాపట్టి వనరులన్ని వాడుకుని ఆర్థిక దోపిడీకి పాల్పడ్డారని వ్యంగ్య ధోరణిలో వర్ణించారు.

అస్సయ్ దూలా హారతి కాళ్ల గజ్జల గమ్మతి
తెలంగాణ లడాయికి కదులుతున్న హిమ్మతి
మా ఆకలి కేకలే తెలంగాణ పిలుపులే
రాష్ట్రమొచ్చేదాకా ఆగవు పోలికేకలే –

అనే పాటలో కోదాడి శ్రీను తెలంగాణ సంస్కృతిలో భాగమైన హిందూ ముస్లింల ఐక్యతను ఎత్తిపట్టారు. అంతేకాకుండా నైజాంను తరిమిన వాళ్ళకు వలసవాద సీమాంధ్రులను తరమడం పెద్ద పని కాదని రాష్ట్ర విభజన డిమాండ్ ను బలంగా వినిపించారు.

ఉస్మానియా క్యాంపస్లో
ఉదయించిన కిరణమా
వీర తెలంగాణమా
నాలుగు కోట్ల ప్రాణమా
కాకతీయ ప్రాంగణంలో
కురిసిన ఓ వర్షమా
వీర తెలంగాణమా
నాలుగు కోట్ల ప్రాణమా –

అంటూ సాగే అభినయ శ్రీనివాస్ పాటలు యూనివర్సిటీ విద్యార్థుల చైతన్యాన్ని, అదిలాబాద్ జిల్లా మొదలుకొని తెలంగాణ జిల్లాలన్నీ పోరుబాట పట్టిన విధానాన్ని కొనియాడుతూ తెలంగాణ వీరత్వాన్ని చాటి చెప్పారు.
"జై బోలో తెలంగాణ" పాటలో అందెశ్రీ కష్టాలు నష్టాలు ఎన్ని ఎదురైనా తెలంగాణ సాధించి తీరాలని లాఠీలు విరిగినా లడాయి మానద్దని, పిడుగులు పడ్డా మడమ తిప్పొద్దని, తెలంగాణ గళ గర్జనల జడివాన అని, స్వరాష్ట్రానికై సాగే పోరులో మరణాన్ని లెక్క

చేయకూడదని, గడీల నుండి దొరలను, రజాకారులను వెళ్ళగొట్టిన వీరత్వాన్ని తిరిగి తెచ్చుకోవాలని నినదించారు.
పల్లెర్ల నిరంజన్ రెడ్డి “తెలంగాణ రాష్ట్రం పిలుస్తోంది పిలుస్తోంది” అంటూ కదలండి కదం తొక్కుతూ అని తెలంగాణ రాష్ట్ర సాధనకు అందరూ ఐక్యంగా పోరాడాలని, నాసం శ్రీనివాస్ “కదిలింది రా కదిలింది రా తెలంగాణ” అని 60 ఏళ్ల ఆక్రోశం దోపిడి ద్రోహాన్ని ఇక సహించమని రైతు కూలీలు, కార్మికులు, కర్షకులు లాయర్లు, డాక్టర్లు అందరూ కలిసి ఉప్పొంగే కెరటాలై ఉదయారుణ కిరణాలవలే కదలాలి అని ఉత్సాహాన్ని నింపారు.

సుద్దాల అశోక్ తేజ
ఆంధ్ర రాయలసీమ అన్నలు
మీరు సీము నెత్తురు లేని దున్నలు –

అంటూ తెలంగాణ వాళ్లు ఎప్పుడూ ఆంధ్ర, రాయలసీమలకు బ్రతకడానికి వెళ్లలేదని అక్కడి వనరులకు ఆశపడలేదన్నారు. ఆంధ్ర, రాయలసీమ నుండి వచ్చినవాళ్లు ఇక్కడి స్థలాలను, ఉద్యోగాలను, నీళ్లను అన్నీ దోచుకుని సమైక్యాంధ్ర పాట పాడుతున్నారన్నారు. తెలంగాణ తల్లి కొరకు తెలంగాణ ప్రజలు ఉద్యమిస్తున్నారని, ఇకపై దోపిడీ కుదరదని హెచ్చరించారు.

వీరులారా వందనం

విద్యార్థి అమరులారా వందనం పాదాలకు అంటూ దరువు ఎల్లన్న రాసిన పాట వీరులును స్మరిస్తూ వ్రాసిన గీతం తెలంగాణ సమాజాన్ని ముఖ్యంగా విద్యార్థి లోకాన్ని కదిలించింది.
ఉద్యమంలో ప్రాణాలు కోల్పోతున్న, ఆత్మహత్యలతో బలిదానం చేసుకుంటున్న శ్రీకాంతాచారి వంటి యువకులను ఉద్దేశించి ఆత్మహత్యలు వద్దని, బలిదానాలు చేసుకోవద్దని

ఎందుకు కాలిపోతావు
నువ్వు ఎందుకు రాలిపోతావు
కాలకురా… నువ్వు రాలకు రా ….మాడి బూడిద కాకురా –

అన్నారు విమలక్క. సావద్దు నా ముద్దుబిడ్డ పోరి సాధించాలి ఈ వీర గడ్డ అంటూ చాకలి ఐలమ్మ, సమ్మక్క సారలమ్మ, దొడ్డి కొమురయ్యల వీరత్వాన్ని తలుచుకొని యవ్వనాన్ని పోరు సాగించుటకు ఉపయోగించాలన్నారు వడ్డె బోయిన శ్రీనివాస్.

ఆత్మహత్యలు చేసుకోవద్దు రా తమ్ముడూ
ఆంధ్రా వాళ్ళను తరిమి కొట్టాలి రా తమ్ముడా బలిదానాలు వద్దమ్మా చెల్లెలా
వలసోల్ల పని పట్టాలమ్మా చెల్లెలా –

అంటూ ఆత్మహత్యలు వద్దని, పోరాడి గెలవాలని, కన్నతల్లిని కడుపుకోతకు గురిచేయడం తగదని, రాబోయే తెలంగాణ మీదేనని, బలిదానం మరిచి బంగారు తెలంగాణ సాధించాలని - రాజమౌళి ఉద్బోధించారు. మరోవైపు చనిపోయిన అమరవీరుల కుటుంబ సభ్యులను ఓదారుస్తూ తంగేళ్ల ఆనందాచారి వంటి వారు తెలంగాణ సూర్యుడు అనే పాటలో
కాసోజు శ్రీకాంతు కన్నతల్లి నువ్వు కన్నీరు పెట్టకమ్మా తల్లడిల్లి అంటూ ఓదార్చారు.

## ముగింపు

“తెలంగాణ సమాజాన్ని నడిపిన ఉద్యమ తీవ్రతను బట్టి పాట పుట్టింది. పాట ఉద్యమ కాలాన్ని తన పల్లవుల్లో, చరణాల్లో పొందుపరచుకొని భవిష్యత్తు తరాలకు దిశా నిర్దేశం చేసే దిక్సూచి అనడంలో సందేహం లేదు” అని చెప్పిన సిద్ధెంకి యాదగిరి మాటలు అక్షర సత్యాలు. పాట అన్ని రంగాల్లో తెలంగాణ వెనకబాటుతనానికి కారణాలను విడమర్చి చెప్పింది. సమస్యలన్నింటికీ రాష్ట్ర సాధన పరిష్కారమనే దిశా నిర్దేశాన్ని ఇచ్చింది. ఆత్మగౌరవం, అస్తిత్వం, స్వయం పాలన ఆకాంక్షను రగిలించింది. పోరాటంలో ఒడిదొడుకులు ఎదురైనప్పుడు ధైర్యాన్ని నూరిపోసింది. తెలంగాణ పోరాటం వెంట పాట నడిచింది, నడిపించింది అనడంలో అతిశయోక్తి లేదు.

## ఉల్లేఖగళు


1. తెలంగాణ ఉద్యమ పాటలు – ఒక పరిశీలన , సిద్ధెంకి యాదగిరి, కొలిమి, సెప్టెంబర్, 2019
2. తెలంగాణ సాయుధ పోరాటం -1948, తెలుగు అకాడమీ, 2015
3. తెలంగాణ ఉద్యమ పాట ప్రాదేశిక విమర్శ - డా. పసునూరి రవీందర్, 2016
4. తెలంగాణ పోరాట పాటలు, జయధీర్ తిరుమలరావు, 1990
5. తెలంగాణ లొల్లి ఆడియో క్యాసెట్ పాటల పుస్తకం సహచర పబ్లికేషన్స్, 2004
6. తెలుగులో ఉద్యమ పాటలు – డా ఎస్వీ సత్యనారాయణ, 1996
7. తెలంగాణ మట్టిపాటలు – 1, 2 – వరంగల్ జిల్లా రచయితల సంఘం, నల్లెల్ల రాజయ్య, 2010
8. తెలంగాణ సాయుధ పోరాటం – రాజకీయ సిద్ధాంతిక వ్యాసాలు, 2018
9. తెలంగాణ పోరాట పాటలు, విరసం, 1972
10. తెలంగాణ పోరాట గేయాలు (వివిధ కవుల గేయ సంకలనం), 1973
11. బండెనుక బండి కట్టి….(వీర తెలంగాణ పోరాట పాటలు) , 2006
12. గుత్ప మర్లేసిన బాటల పాటలు, ఎన్ వేణుగోపాల్, సారంగ, 1, జూలై -2021